

భారీ సొర..!



- గిలకలదిండి జాలర్లకు చిక్కిన సొర చేప
- ఔషధ ఆయిల్స్ లేవు.. తినడానికి పనికిరాదు..
- మత్స్యకారులకు నిరాశ

మచిలీపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం జాలర్లకు భారీ సొరచేప చిక్కింది. గిలకలదిండి హార్బర్ నుంచి సోనాబోటులో సముద్రంలో చేపల వేటకు వెళ్లిన క్యాంప్‌బెల్‌పేట జాలర్లకు టన్నున్నర బరువున్న ఈ చేప చిక్కింది. దీనిని అతికష్టం మీద క్రేన్‌సాయంతో ఆదివారం హార్బర్‌కు చేర్చారు. ఆయుర్వేద మందుల్లో వాడే పదార్థాలు ఉంటాయనే ఆశతో దీనిని కోసి చూశారు. అవేమీ లేకపోవడంతో పాటు మాంసం రబ్బరు మాదిరిగా ఉండి తినడానికి పనికిరాదని తెలుసుకుని నీటిలో పడేశారు. సాధారణంగా ఇలాంటి చేపల్లో నల్లబంగారంగా పిలిచే ఔషధ గుణాలున్న పదార్థం ఉంటుందని, ఈ తరహా చేపలు జాలర్లకు అరుదుగా దొరుకుతాయని స్థానిక మత్స్యకారులు చెబుతున్నారు.





కొండంత భక్తి

ఇంద్రకీలాద్రి భక్తులతో కిటకిటలాడింది. ఆషాఢ మాసం.. అందునా ఆదివారం జగన్మాతను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. సారె తీసుకొచ్చిన భక్తులతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. విజయవాడ నగర పోలీసుల తరపున పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు దంపతులు ఆదివారం రాత్రి అమ్మవారికి సారె సమర్పించారు. డీసీపీలు గౌతమి శాలి, ఉదయరాణి, హరికృష్ణ తదితరులు సీపీ వెంట నడిచారు.

ఎటువైపు సాగు..?

జిల్లాలో పొలాలకు సాగు నీరందక రైతుల ఇక్కట్లు

ఓవైపు సాగునీరు.. మరోవైపు తాగునీరు.. జిల్లా రైతులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఆగస్టు వచ్చినా పంటలకు సాగునీరందక అన్నదాత ఆకాశంవైపు ఆశగా చూస్తుండగా, పోనీ.. ప్రకాశం బ్యారేజీ నుంచి కాల్వలకు విడుదల చేస్తున్న తాగునీరైనా శివారు ప్రాంతాలకు చేరుతుందా.. అంటే అదీ లేదు. మరో రెండు రోజుల్లో పట్టిసీమ నుంచి ప్రకాశం బ్యారేజీకి వరద నీరు చేరే అవకాశం ఉండటంతో ఈసారైనా సరిపడా సాగునీరు ఇస్తారా లేక వరుణుడే దిక్కవుతాడా..? అని రైతులు ఎదురుచూస్తున్నారు.



బందరు కాల్వ పరిస్థితి ఇదీ..

- వరుణుడి కరుణ కోసం ఆశగా ఎదురుచూపులు
- ప్రకాశం బ్యారేజీ నుంచి కాల్వలకు నీటి విడుదలను పెంచే అవకాశం
- తాగునీటికీ అరకొరగానే విడుదల
- ఇంకా నిండని శివారు ప్రాంతాల్లోని చెరువులు
- నేడు జిల్లాలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కాల్వల ద్వారా వచ్చిన నీరు, బోరునీరు, వర్షాధారంగా ఇప్పటివరకు జిల్లాలో 69,500 హెక్టార్లలో వరినాట్లు పూర్తిచేశారు. ఇందులో 34 వేల హెక్టార్లలో వెదజల్లే పద్ధతిలో వేశారు. మరో 90 వేల హెక్టార్లలో వరినాట్లు వేయాల్సి ఉంది. వరినాట్లు వేసిన, వేయబోయే పొలాలకు సాగునీరు అత్యంతం అవసరం. కానీ, కాల్వలకు కొసరి కొసరి సాగునీటిని విడుదల చేస్తుడటంతో అవి ఏ మూలకూ సరిపోని పరిస్థితి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మోస్తరు వర్షం కురిసింది. సోమవారం కూడా కోస్తాతీరం వెంబడి వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ చెప్పడంతో రైతులు ఆశగా ఆకాశంవైపు చూస్తున్నారు.

నీటి విడుదల పెంచేనా..?

ప్రకాశం బ్యారేజీ వద్ద ఆదివారం సాయంత్రానికి 11.2 అడుగుల మేర నీటిమట్టం ఉంది. పట్టిసీమ ప్రాజెక్టు నుంచి 15 మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేస్తుండగా, ఆ నీరు ఆదివారం సాయంత్రానికి బ్యారేజీకి చేరుకుంటుందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. కృష్ణాడెల్టాకు సాగు, తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని సోమవారం నుంచి పట్టిసీమ ప్రాజెక్టు వద్ద 20 మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేస్తారని అధికారులు అంటున్నారు. మంగళవారం సాయంత్రానికి బ్యారేజీ వద్ద నీటిమట్టం పెరుగుతుందని, కృష్ణాడెల్టాకు సాగునీటిని సరఫరా చేసే కాల్వలకు నీటి విడుదలను అధికంచేసే అవకాశం ఉందనేది అధికారుల మాట.

చెరువులు నిండనే లేదు..

జిల్లాలో 266 తాగునీటి చెరువులున్నాయి. జూన్‌లోనే ఇవి నిండుకున్నాయి. జిల్లావ్యాప్తంగా ఈనెలలో 10 రోజుల పాటు భారీవర్షాలు కురిశాయి. బ్యారేజీ నుంచి వచ్చిన నీటితో పాటు వర్షం ఆధారంగా వచ్చిన నీటితో పంట కాల్వలు నిండాయి. అయితే, కాల్వల్లో నీరు అందుబాటులో ఉన్నా తాగునీటి చెరువులను మాత్రం నింపకుండా పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఇది తమ బాధ్యత కాదన్నట్లుగా ఉండిపోయారు. దీంతో శివారు ప్రాంతంలో ఉన్న మచిలీపట్నం, గుడివాడ, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లోని తాగునీటి చెరువులు నిండలేదు. ఇదే విషయాన్ని శనివారం జరిగిన జడ్పీ సమావేశంలో శాసనసభ్యులు ప్రస్తావించారు.

అరకొరగా సాగునీరు

ప్రకాశం బ్యారేజీ నుంచి బందరు కాల్వకు 1800 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉండగా, 500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దివిసీమ ప్రాంతానికి సాగునీటిని అందించే కేఈబీ కాల్వకు 1700 క్యూసెక్కులకుగానూ 530 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నిమ్మగడ్డ లాకుల వద్ద 530 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. బందరు, చల్లపల్లి, ఘంటసాల తదితర మండలాలకు సాగునీటిని అందించే కేఈబీ కాల్వకు అనుబంధంగా ఉన్న తొమ్మిదో నెంబరు కాల్వకు 330 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉండగా, తక్కువగా విడుదల చేస్తున్నారు. దీంతో శివారు ప్రాంతాలకు సాగునీరు చేరడం లేదు. దీంతో మచిలీపట్నం మండలంలోని వాడపాలెం, పెదయాదర, కోన, తుమ్మలచెరువు తదితర గ్రామాల్లో నారుమడులు పోసుకునేందుకు, పోసిన నారుమడులను బతికించుకునేందుకు సైతం సాగునీరందని పరిస్థితి ఏర్పడింది. ఏలూరు, గుడివాడ, నందివాడ, బంటుమిల్లి, కృత్తివెన్ను తదితర ప్రాంతాలకు సాగునీరందించే రైవస్ కాల్వకు మూడువేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉండగా, 1500 క్యూసెక్కులే విడుదల చేస్తున్నారు. ఫలితంగా కాల్వల్లో నీటిమట్టం పెరగకపోవడంతో పొలాల్లోకి నీరుపారే పరిస్థితి లేకుండాపోయింది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వరినాట్లు వేశారు. నాట్లు వేసిన పొలాల్లోని పైరును బతికించుకునేందుకు నీరు అవసరం. నాట్లు వేస్తున్న పొలాల్లో వరిమొక్కలు బతికేలా పొలాల్లో వారానికి సరిపడా నీరుపెట్టాలి. వెదజల్లే పద్ధతిలో నాట్లు వేసిన పొలాల్లో నీరు లేకుంటే కలుపు పెరుగుతుందని, పొలంలో సరిపడా నీటిని పెడితే కలుపు బెడద కొంతమేర తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. భారీవర్షాలు కురిసిన సమయంలో సరైన అంచనా లేకుండా పట్టిసీమ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలను నిలిపివేయడం, పులిచింతల ప్రాజెక్టు నుంచి నీరు ఇప్పట్లో ప్రకాశం బ్యారేజీకి వచ్చే అవకాశం లేకున్నా నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం సాగునీటి ఇక్కట్లు నెలకొన్నాయని రైతులు అంటున్నారు. ఆశించిన మేర వర్షాలు కురిస్తే పులిచింతల, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు సెప్టెంబరు, అక్టోబరులో నిండుతాయని, ఈ రెండు నెలలు కృష్ణాడెల్టాకు సాగునీటిని విడుదల చేయాలంటే పట్టిసీమ ప్రాజెక్టు మాత్రమే ఆధారమని, ఈ ప్రాజెక్టు ద్వారా వంతులవారీ పద్ధతిలోనైనా సాగునీటిని కాల్వలకు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

అసైన్డ్ భూములపై హక్కులు కల్పించండి

టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్న పేదలు

- వైసీపీ ఉత్తుత్తి గజిట్‌తో మభ్యపెట్టింది
- ఈ ప్రభుత్వమైనా నిషేధాన్ని తొలగించాలని వేడుకోలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అసైన్డ్ ఇళ్ల పట్టాలు, సాగు భూములకు యాజమాన్య హక్కులు కల్పించి, నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని ఉమ్మడి కృష్ణాజిల్లా వాసులు కోరుకుంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ విషయంలో ఒక అడుగు ముందుకేసినా అధికారులు అమలు చేయలేదని, ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వ హయాంలో గజిట్ నోటిఫికేషన్ ఇచ్చినా అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు వైసీపీ నేతల ప్రయోజనాల కోసం ఈ గజిట్ తీసుకొచ్చారే తప్ప నిజమైన పేదలకు మాత్రం అన్యాయం జరిగిందంటున్నారు. రెవెన్యూ సంబంధిత అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం సమీక్షించనున్న నేపథ్యంలో ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరుకుంటున్నారు. తద్వారా ప్రభుత్వానికి ఆదాయంతో పాటు దశాబ్దాలుగా నిరర్థక ఆస్తులుగా మిగిలిపోయిన వాటికి విలువ పెరుగుతుందని చెబుతున్నారు.

ఈసారైనా అమలు చేయండి

ఉమ్మడి కృష్ణాజిల్లాలో అసైన్డ్ ఇళ్ల పట్టాలు పొందినవారు ఒక్కో నియోజకవర్గానికి దాదాపు 8 వేల మందికి పైగా ఉన్నారు. వీరిలో సింహభాగం ఇళ్ల పట్టాలు పొందినవారే. 1991వ సంవత్సరం నుంచి పేదలకు ఆవాస స్థలాలు ఇచ్చారు. అప్పట్లోనే టీడీపీ ప్రభుత్వ హయాంలో లే అవుట్లు వేసి మరీ ప్లాట్లను ఇచ్చారు. అవి ఇప్పుడు అభివృద్ధి చెందిన కాలనీలుగా మారాయి. కానీ, 20 ఏళ్లు కావస్తున్నా.. ఇంకా అసైన్డ్ భూములుగానే ఉన్నాయి. పదేళ్లు దాటిన ఇళ్ల పట్టాలకు యాజమాన్య హక్కులు ఇవ్వాలని గతంలో టీడీపీ ప్రభుత్వం నిర్దేశించింది. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉత్తుత్తి గజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వమైనా దీనిని అమలు చేయాలని కోరుతున్నారు. కిందటి ప్రభుత్వం ఇచ్చిన గజిట్ ప్రకారం చేతులు మారి, పదేళ్లు పూర్తి చేసుకున్న ఇళ్ల పట్టాలు, 20 ఏళ్లు దాటిన సాగు పట్టాదారులకు యాజమాన్య హక్కులు కల్పించవచ్చు. తద్వారా వారు అమ్ముకోవటానికి, తమ పిల్లల పేరుతో రిజిస్ట్రేషన్లు చేయించుకోవటానికి లేదా బ్యాంకు రుణాలు పొందటానికి అవకాశం ఉంటుంది.

'జీసీకేసీ'పై కేసు నమోదు

- జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి కొండారెడ్డి ఫిర్యాదు
- రొయ్యూరులో ఇసుక అక్రమ తవ్వకాలే కారణం

తోట్లవల్లూరు, జూలై 28 : వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా ఇసుక దోచుకున్న జీసీకేసీ సంస్థపై తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. జిల్లా మైనింగ్ అండ్ జియాలజీ అధికారి టి.కొండారెడ్డి శనివారం రాత్రి జీసీకేసీపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్సై పి.విశ్వనాథ్ ఆదివారం తెలిపారు. జనవరి నుంచి రొయ్యూరులో పెద్దఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు జరిపిన విషయం తెలిసిందే. దీనిపై గతంలో అనేకసార్లు 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు వచ్చాయి. స్థానిక తహసీల్దార్ మూడుసార్లు ఇసుక తవ్వకాలు ఆపించినా రెండు రోజులకే మొదలు పెట్టేవారు. అప్పటి వైసీపీ ప్రభుత్వ పెద్దల అండతో జిల్లా అధికారులు ఈ అక్రమాలకు కొమ్ముకాశారు. పర్యావరణ అనుమతులు లేకుండా జరుగుతున్న ఇసుక తవ్వకాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ జిల్లా కలెక్టర్లను నివేదిక కూడా కోరింది. దీంతో ఫిబ్రవరి 13న అప్పటి కలెక్టర్ రాజాబాబు ఆధ్వర్యంలో అధికారుల బృందం తోట్లవల్లూరు మండలం వచ్చి అక్రమంగా నడుస్తున్న రొయ్యూరు క్వారీని పక్కన పెట్టి, మూడున్నరేళ్ల కిందట మూతపడిన నార్తువల్లూరు క్వారీని సందర్శించి అక్రమ తవ్వకాలు లేవని తేల్చారు. ఇలా పెద్దలు జీసీకేసీ అక్రమాలకు దన్నుగా నిలిచారు. రొయ్యూరు గ్రామస్తులు సైతం ఇసుక అక్రమ తవ్వకాలను పలుమార్లు అడ్డుకున్నారు. అయినా నాటి వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావటంతో ఇసుక తోడేళ్లపై చర్యలకు ఉపక్రమించింది.

బుక్ బ్యాంకులెక్కడ..?

పాఠశాలల్లో కనిపించని బుక్ బ్యాంకులు

పుస్తకాల సేకరణను పక్కన పెట్టేసిన ఉపాధ్యాయులు

- ఒకప్పుడు భారీగా పాత పాఠ్యపుస్తకాల సేకరణ
- వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిలుపుదల
- మూలనపడిన ఉపయోగకరమైన విద్యావిధానం

పాఠశాలల్లో బుక్ బ్యాంకులకు మంగళం పాడేశారు. గతంలో ఒక తరగతి నుంచి మరో తరగతి వెళ్లే విద్యార్థుల నుంచి పాత పాఠ్యపుస్తకాలు తీసుకుని భద్రపరిచేవారు. కొత్త పాఠ్యపుస్తకాలు ఆలస్యంగా చేరితే, పాత పుస్తకాలతో సిలబస్‌ను మొదలుపెట్టేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక బుక్ బ్యాంకులు వద్దని చెప్పడంతో విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉండే ఈ విధానం మూలకు చేరింది.




(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఆరో తరగతి పూర్తిచేసి ఏడులోకి అడుగుపెట్టే విద్యార్థుల వద్ద ఉన్న పాత పాఠ్యపుస్తకాలను విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ఉపాధ్యాయులు సేకరించేవారు. అలాగే, ఏడు పూర్తిచేసి ఎనిమిదో తరగతిలోకి అడుగుపెట్టే విద్యార్థుల నుంచి కూడా పుస్తకాలు తీసుకునేవారు. 2022-23 విద్యా సంవత్సరం వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇలానే చేసేవారు. ఈ పాఠ్యపుస్తకాలను ఒక గదిలో భద్రపరిచేవారు. వాటిని బుక్ బ్యాంక్‌లుగా వ్యవహరించేవారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభమై నెల దాటినా ప్రభుత్వ పాఠశాలల్లో బుక్ బ్యాంక్‌ల మాట లేదు. వాస్తవానికి ఈ బుక్ బ్యాంక్‌ల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ ఎన్నికలకు ముందు గత వైసీపీ ప్రభుత్వం మంగళం పాడేసింది. విద్యార్థుల పాత పాఠ్యపుస్తకాలను వెనక్కి తీసుకోవద్దని 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బుక్ బ్యాంక్‌ల జోలికి వెళ్లడం మానేశారు.

ఉపయోగమేంటి?

మొదటి, రెండో తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ పాఠ్యపుస్తకాలు ఉంటాయి. మూడు నుంచి ఐదో తరగతులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం, ఈవీఎస్ (ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/సైన్స్ సోషల్) పాఠ్యపుస్తకాలు ఉంటాయి. ఆరు నుంచి పదో తరగతి వరకు ఆరు పాఠ్యపుస్తకాలు ఉంటాయి. ప్రతి విద్యాసంవత్సరంలో ప్రభుత్వం ఈ పుస్తకాలను ముద్రించి విద్యార్థులకు అందజేస్తుంది. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచాక వారంలోపు పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేయాల్సి ఉంటుంది. ఒక్కో ఏడాది పాఠ్యపుస్తకాల ముద్రణ ఆలస్యమవుతుంటుంది. కొన్నిసార్లు కొన్ని పాఠ్య పుస్తకాలే పాఠశాలలు తెరిచే సమయానికి వస్తుంటాయి. మిగిలిన వాటి కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. ఈ విద్యాసంవత్సరంలో మాత్రం దాదాపు అన్ని తరగతులకు పాఠ్యపుస్తకాలు పాఠశాలలు తెరిచే నాటికే అందాయి. కానీ, అన్ని విద్యా సంవత్సరాల్లో ఇదే పరిస్థితి ఉంటుందని చెప్పలేం. అటువంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పాత విద్యాబోధన చేయడానికే గతంలో ఇలా పుస్తకాలు సేకరించేవారు. కొత్త పాఠ్యపుస్తకాలు పాఠశాలలకు చేరుకునే లోగా పాతవి ఉపయోగపడేవి.

నష్టం లేదు కదా?

విద్యా ప్రణాళికలో పాఠ్యాంశాలు, పాఠ్యపుస్తకాల మార్పు నిరంతరం కొనసాగుతోంది. కొత్త సిలబస్‌ను పరిచయం చేసినప్పుడు పాత పుస్తకాలతో పెద్దగా పని ఉండదు. కొత్త సిలబస్‌లో కొన్ని పాఠ్యాంశాలు మాత్రం పాత సిలబస్‌కు లింకై ఉంటుంది. ఈ నేపథ్యంలో పాఠ్యపుస్తకాలను రిఫరల్ బుక్స్‌గా అందుబాటులో పెట్టుకోవాలి. ఇలా చేయడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పెద్దగా ఆసక్తిని చూపడం లేదని తెలుస్తోంది. బుక్ బ్యాంక్‌లను నిర్వహించడమే పాఠశాలలు ఒక భారంగా భావిస్తున్నాయని కొంతమంది ఉపాధ్యాయులు బహిరంగంగా చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. తర్వాత మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు సిలబస్ ఈ పాఠ్యపుస్తకాల నుంచే ఉంటుంది. అందువల్ల అభ్యర్థులు అవసరమైన పాఠ్యపుస్తకాల కోసం మార్కెట్లో తిరుగుతున్నా అందుబాటులో ఉండడం లేదు. విద్యార్థుల నుంచి పాత పాఠ్యపుస్తకాలను తీసుకుని బుక్ బ్యాంక్‌లను నిర్వహిస్తే ఇలా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉపయోగపడతాయన్న అభిప్రాయం విద్యావంతుల నుంచి వ్యక్తమవుతోంది.



క్లీన్ 'సీ'న్

6లో..

కలెక్టర్ డీకే బాలాజీ నేతృత్వంలో అధికారులు, ఉద్యోగులకు ఆదివారం మంగినపూడి బీచ్‌లో ప్రత్యేక యోగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్, అధికారులు సముద్ర తీరాన్ని స్వయంగా శుభ్రం చేశారు.

పడకేసిన పల్లెలు!

ప్రజలను పట్టి పీడిస్తున్న విషజ్వరాలు



కూచిపూడి ఆసుపత్రిలో జ్వరపీడితులు

- రోగులతో ఆసుపత్రులు కిటకిట
- గ్రామాల్లో కొరవడిన పారిశుధ్యం

కూచిపూడి, జూలై 28 : జ్వరాలతో పల్లెలు మంచం పట్టాయి. గ్రామాల్లో పారిశుధ్యం కొరవడింది. జ్వరపీడితులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం కొరవడటంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. జ్వరాల బారిన పడిన



రోగులతో ప్రైవేట్ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు అధికంగా ఉన్నాయి. గ్రామాల్లో రోడ్ల పక్కన చెత్తాచెదారాలు నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. దోమలు విజృంభిస్తున్నాయి. గ్రామపంచాయతీల వారు రోడ్ల పక్కన బ్లీచింగ్ చల్లించటం మినహా.. దోమల నివారణ మందు పిచికారి చేయటం, ఓవర్ హెడ్ ట్యాంక్‌లు శుభ్రపరిచి క్లోరినేషన్ వంటి కార్యక్రమాలు చేపట్టడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మొవ్వ నిడుమోలు గ్రామాల్లో ప్రభుత్వవైద్యశాలలు ఉన్నప్పటికీ, ప్రైవేట్ ఆసుపత్రుల వైపే రోగులు మొగ్గు చూపుతున్నారు. వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది సర్వేలకు పరిమితం కావటంతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలకు జ్వర పీడితులు వెళ్లి వైద్యసేవలు పొందలేకపోతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలపై ఆయా గ్రామపంచాయతీలు దృష్టిసారించటంతోపాటు ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యసేవలు మెరుగుపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొర్లమండలో కొనసాగుతున్న వైద్య శిబిరం

విస్సన్నపేట : కొర్లమండలో విరేచనాలతో రోగుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఆదివారం గొల్లగూడెం ఎంపీపీ పాఠశాలలోని అత్యవసర చికిత్స కేంద్రంలో పలువురికి వైద్య సేవలందించారు. శనివారం రాత్రి మరో ముగ్గుర్ని విస్సన్నపేట సీహెచ్‌సీకి తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. డీఎం అండ్ హెచ్‌వో



కొర్లమండలో వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న జిల్లా వైద్యాధికారిణి సుహాసిని



విస్సన్నపేట పీహెచ్‌సీలో..

సుహాసిని చికిత్స కేంద్రాన్ని సందర్శించారు. తిరువూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న జి.చిట్టెమ్మను మెరుగైన వైద్యంకోసం విజయవాడ తరలించినట్టు చెప్పారు. గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. విరేచనాలు బారిన పడుతున్న వారు వెంటనే ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందాలన్నారు. ఒక శుభకార్యానికి హాజరైన రెండు కుటుంబాలు మాంసాహారం తినడంతో పాటు గ్రామంలో కలుషిత నీరు తాగడం వల్లే అనారోగ్యానికి కారణమన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. 24 గంటల పాటు 108 వాహనాలు సిద్ధంగా ఉంచామన్నారు. వైద్యాధికారులు ఇందుమతి, వి.పెద్దిబాబు, ఎంపీడీవో జి.విజయ్‌కుమారి, టీడీపీ నేతలు వైద్య శిబిరాన్ని సందర్శించారు.



కొర్లమండలో అధ్వానంగా పారిశుధ్యం



అమ్మవారికి సారె తీసుకువస్తున్న భక్త బృందాలు

దుర్గమ్మకు ఆషాఢ సారె



వన్‌టౌన్, జూలై 28 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు ఆషాఢమాసం సందర్భంగా పలు ప్రాంతాల నుంచి భక్త బృందాలు సారె సమర్పించుకుంటున్నారు. పలు రకాల తీపి పదార్థాలు, వస్త్రాలు, పండ్లు, పూలు, గాజులు, సుగంధ పరిమళ ద్రవ్యాలతో సమర్పించుకుంటున్నారు. ఆయురారోగ్యాలు క్షేమసౌఖ్యాలు కలగాలని అమ్మవారికి సారెలు సమర్పిస్తున్నారు. ఆదివారం పలు ప్రాంతాల నుంచి భక్త బృందాలు సారెను సమర్పించాయి. ఆలయం ఆధ్యాత్మిక శోభతో గుభాళించింది. ఆదివారం సూర్యోపాసన సేవ చేశారు. సూర్యనారాయణ స్వామి చిత్ర పటానికి అర్చనలు, జపం అనంతరం తర్పణ చేశారు. మంత్రపుష్పం, హారతి సమర్పించారు.



సొమ్మసిల్లిన మహిళాభక్తులు..



పలు ప్రాంతాల నుంచి సారె సమర్పించడానికి వచ్చిన మహిళా భక్తులు పలువురు నీరసంతో సొమ్మసిల్లిపడిపోయారు. సారె సమర్పించేందుకు వస్తూ ఉపవాసం పాటించడం వల్ల ఇలా జరిగిందని చెబుతున్నారు. వారి బంధువులు ఉపచర్యలు చేశారు.

ఆలయ గోపుర స్వర్ణతాపడం, అన్నవితరణకు విరాళాలు

దుర్గమ్మ ఆలయ గోపుర స్వర్ణతాపడానికి, అన్నవితరణ కార్యక్రమానికి ఆదివారం పలువురు డోనర్ సెల్ ద్వారా విరాళాలు అందజేశారు.

- తెలంగాణాలోని సంగారెడ్డిలో గల మంజీరానగర్‌కు చెందిన దూదేకుల అస్సాన్, కుటుంబసభ్యులతో కలిసి రూ.2 లక్షల విరాళాన్ని, సూర్యాపేటకు చెందిన కాజ నిర్మల లక్ష్మి రూ.1,00,116 విరాళాన్ని ఈవో రామారావుకు చెక్కురూపంలో అందజేశారు.
- విజయవాడ మొగల్రాజపురానికి చెందిన పోసం కృష్ణకుమార్ నాయుడు, కుటుంబసభ్యులతో కలిసి అన్నవితరణ కార్యక్రమానికి రూ. 1,00,116లు చెక్కురూపంలో అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం దాతలకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న దేవదాయ కమిషనర్



దేవదాయ కమిషనర్ సత్యనారాయణ ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఈవో రామారావు, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలు అందజేశారు.



భక్తులతో కిటకిటలాడిన సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయం

వైభవంగా సుబ్బారాయుడి పవిత్రోత్సవాలు

మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పవిత్రత్సోవ సహిత ఆషాఢ కృత్తికా మహోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహోత్సవంలో భాగంగా అర్చక బృందం వేదమంత్రోచ్చరణల నడుమ ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆదివారం పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. బొప్పన సత్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.



ప్రజలనుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న మంత్రి రవీంద్ర

రూ. 220 కోట్లతో ఇంటింటికీ తాగునీరు

- రూ. 160 కోట్లతో రహదారులు, డ్రెయిన్ల అభివృద్ధి
- ప్రజాదర్బార్‌లో వినతి పత్రాలు స్వీకరించిన మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 28 : కేంద్ర ప్రభుత్వ జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ. 220 కోట్లతో ఇంటింటికీ తాగునీరు అందిస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా రవీంద్ర ప్రజలనుంచి వినతి పత్రాలు స్వీకరించారు. మచిలీపట్నంలో టీటీడీ కళ్యాణ మంటపానికి మరమ్మతులు చేపట్టాలని, మండపంలో తొలగించిన ఆన్‌లైన్ కౌంటర్‌ను పునరుద్ధరించాలని బీజేపీ నేత ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి వినతి పత్రం అందజేశారు. నగరంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, నియంత్రణ చర్యలు తీసుకోవాలని అద్దేపల్లి పార్వతి కోరారు. టిడ్కో ఇళ్ల స్వాధీన పరచాలని లబ్ధిదారులు కోరారు. రేషన్ కార్డులు, వృద్ధాప్య పింఛన్‌లు ఇప్పించాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఉపాధిహామీ పథకం కింద జిల్లాకు రూ. 160 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఆ నిధులతో గ్రామాల్లోని రహదారులు, డ్రెయినేజీలు, స్మశాన వాటికకు ప్రహరీలు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. నగరంలో మురుగు కాల్వల్లో పూడిక తీయించే కార్యక్రమం చేపట్టామన్నారు. టీడీపీ నాయకులు మోటమర్రి బాబా ప్రసాద్, గోపు సత్యనారాయణ, పీవీ ఫణికుమార్, ఎండీ ఇలియాస్ బాషా, పిప్పళ్ల కాంతారావు, గోకుల్ శివ, టీడీపీ కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, జనసేన నాయకులు బండి రామకృష్ణ, మాదివాడ రాము తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి మొండిచేయి

- బడ్జెట్ ప్రతులను దహనం చేసిన రైతు సంఘాల నేతలు



లెనిన్ సెంటర్‌లో బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న రైతు సంఘాల నేతలు

గవర్నర్‌పేట, జూలై 28 : కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి మొండి చేయి చూపిందని, రైతులకు తీరని అన్యాయం చేసిందని మాజీ వ్యవసాయ శాఖామంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ధ్వజమెత్తారు. వ్యవసాయ రంగానికి ఆశించిన స్థాయిలో బడ్జెట్ కేటాయింపులు జరగలేదని ఆరోపిస్తూ ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఆదివారం లెనిన్ సెంటర్‌లో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే మాట్లాడుతూ, వ్యవసాయ రంగంపై ఆధారపడిన రైతులు, వ్యవసాయ కూలీలకు బడ్జెట్‌లో అతి తక్కువ నిధులు కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడా కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు కల్పించారని, రుణాలు మాఫీ చేశారని ఎద్దేవా చేశారు. ఉపాధి హామీ పథకానికి కూడా నిధులు తగ్గించడం వల్ల వ్యవసాయ కార్మికులకు పనిదినాలు తగ్గాయన్నారు. పనులు లేక గ్రామీణ రైతులు, రైతు కూలీలు పట్టణాలకు వలసలు పోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై సబ్సిడీలు ఎత్తివేశారని, మార్కెట్ సౌలభ్యం ఏర్పాటు చేయలేదని, ప్రభుత్వ ఎఫ్‌సీఐ గోడౌన్లు కూడా బడా కంపెనీలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర నాయకులు వై.కేశవరావు, పి.జమలయ్య, ఎం.హరిబాబు, ఎం.యలమందరావు, పీవీ ఆంజనేయులు, మరీదు ప్రసాద్, పోలవరపు కృష్ణ, మాదు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ రైతు బడ్జెట్‌ను వ్యతిరేకించండి

- ఏఐసీటీయూ, వామపక్ష అనుబంధ సంఘాల ధర్నా



పంజా సెంటర్‌లో ధర్నా చేస్తున్న వామపక్ష అనుబంధ సంఘాల నేతలు

వన్‌టౌన్ : ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బడ్జెట్‌ను వ్యతిరేకించాలని, వ్యవసాయ బడ్జెట్ ప్రసంగ పాఠం నకళ్లను దహనం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు పంజాసెంటర్‌లో ఏఐసీటీయూ, వామపక్ష అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించి, బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్‌లోని కేటాయింపులు రైతులను ఆదుకునే విధంగా లేవన్నారు. పంటలకు మద్దతు ధర ఊసేలేదన్నారు. కేంద్రం పునరాలోచించి పార్లమెంట్ సమావేశాలలో బడ్జెట్‌ను సవరించి వ్యవసాయరంగానికి రూ. 5 లక్షల కోట్లు, ఆహార భద్రతకు రూ. 30లక్షల కోట్లు, ఉపాధి హామీ పథకానికి రెండు లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మర్రెడ్డి వెంకటరెడ్డి, ఏఐసీటీయూ నాయకులు గొల్లపూడి ప్రసాద్, వీఎల్ నారాయణ, విగ్నేష్, యూవైఎఫ్‌ఐ నాయకులు కాసాని గణేష్ బాబు, అనకాపల్లి కనకరాజు, పి.శ్రీనివాస్, యూఎస్ఎఫ్‌ఐ నాయకులు ఎస్‌డీ సిరాజ్, కాసాని యువరాజ్, మహిళ సంఘం నాయకులు సోమీ ఎల్లమ్మ, కాసాని సుజాత, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.



యార్లగడ్డకు అపూర్వ స్వాగతం

పమిడిముక్కల, జూలై 28 : గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాలకు పమిడిముక్కల మండల పరిధిలో ఆదివారం కూటమి పార్టీల శ్రేణులు అపూర్వస్వాగతం పలికారు. గన్నవరం ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగిడిన తరువాత వెంకట్రావు స్వగ్రామమైన పెనుముత్స వెళుతున్న సందర్భంగా మంటాడ వద్ద ఎమ్మెల్యే కుమార్‌రాజ, పలువురు నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో వారు పూజలు చేశారు. అనంతరం కపిలేశ్వరపురంలో తాతినేని రమేశ్ నివాసం వద్ద మహిళలు హారతులివ్వగా తాతినేని సాయిదత్తు సోదరులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జేసీబీతో ఎమ్మెల్యేలపై గులాబీల వర్షం కురిపించారు. గజమాలతో సత్కరించి ఎడ్లబండిపై వందలాది అభిమానులు వెంటరాగా భారీఎత్తున ఊరేగింపుగా తీసుకువెళ్లారు. టీడీపీ నాయకులు లింగంనేని బాబూరావు, కొల్లిపర బాబి, మండల పార్టీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు జక్కా శ్రీనివాసరావు, బుల్లెట్ బాబి, కిరణ్ తదితరులు వెంకట్రావుకు అపూర్వస్వాగతం పలికారు. అభిమానుల ఆదరాభిమానాలు ఎన్నటికీ మరువలేనని వెంకట్రావు ఉద్వేగానికి లోనయ్యారు.

ఐకమత్యమే మా నినాదం

- పద్మశాలీయుల రాష్ట్ర సమావేశం
- హాజరైన ప్రతినిధులు, ప్రముఖులు
- ప్రజాస్వామ్య పద్ధతిలో కమిటీ ఏర్పాటు



పద్మశాలీ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది కోటేశ్వరరావు

గవర్నరుపేట, జూలై 28: 'ఐకమత్యమే మన ఏకైక నినాదం' పేరుతో పద్మశాలీయుల రాష్ట్రస్థాయి సమావేశం ఆదివారం మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. సమావేశంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన పద్మశాలీ ప్రతినిధులు, ప్రముఖులు మాట్లాడారు. పద్మశాలీ దర్శిని యాప్ ద్వారా ప్రపంచంలోని రెండున్నర కోట్ల మంది పద్మశాలీయులు ఒకే వేదికపైకి వచ్చే అవకాశముందని, ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కౌతవరపు ప్రసాద్ సూచించారు. 'ప్రతిభాశాలి-పద్మశాలి' నినాదంతో అందరూ ఒక తాటిపైకి వచ్చి కలిసికట్టుగా పనిచేస్తే సంఘం బలపడుతుందని గుంటూరుకు చెందిన హైకోర్టు న్యాయవాది వైకోటేశ్వరరావు (వైకె) సూచించారు. ప్రజాస్వామిక పద్ధతిలో రాష్ట్ర పద్మశాలీయుల కమిటీని ఏర్పాటు చేసే బాధ్యతని ఒక ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటు చేసి దానికి రాష్ట్ర కమిటీ ఎన్నిక బాధ్యతను అప్పగిస్తే బాగుంటుందని, అప్పుడే పద్మశాలీయులు విజయం సాధిస్తారని ప్రొద్దుటూరుకు చెందిన నాగమల్లి శంకర్ సూచించారు. అఖిల భారత పద్మశాలీయ సంఘం ద్వంద్వ వైఖరితో వ్యవహరిస్తోందని, దాని అనుబంధ సంఘాలైన మిగిలిన అన్ని పద్మశాలీయ సేవా సంఘాలు ఒకే తాటిపైకి రావడానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని అందె జగదీష్ పేర్కొన్నారు. ప్రతి జిల్లానుంచి ప్రముఖులతో ఒక కమిటీని వేసి వారు లేఖ ద్వారా ఆహ్వాన కమిటీకి నివేదిక ఇస్తే 13 జిల్లాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్ర కమిటీని వేస్తే బాగుంటుందని గోలి వెంకటేశ్వరరావు, యంగల కోటేశ్వరరావు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. యువతకు గుర్తింపు ఇచ్చే వరకు పద్మశాలీయ సంఘం బలపడదని మునగాల రవికిరణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన పద్మశాలీయ ప్రముఖులు గంజి చిరంజీవి, మాజీ ఎంపీ డాక్టర్ శింగరి సంజీవ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ రాధయ్య, మేరుగ వెంకటేశ్వర్లు, మాజీ ఇన్‌కంటాక్స్ అధికారి స్వర్గం పుల్లారావు, ముట్టే రామచంద్రరావు, హైకోర్టు న్యాయవాది చిలువేరు మార్కండేయ, తెడ్లపు వెంకటేశ్వరరావు, జగ్గరపు శ్రీనివాసరావు, రాపోలు జగన్, కౌతవరపు సత్యనారాయణ, పద్మావతి, పంచుమర్తి లక్ష్మీ మేష్ పాల్గొన్నారు.

మంగినపూడికి పర్యాటక శోభ కల్పిస్తాం

- యోగశిక్షణలో మంత్రి కొల్లు రవీంద్ర



ప్రాణాయామం చేస్తున్న రవీంద్ర, కలెక్టర్, జేసీ

మచిలీపట్నం టౌన్, జూలై 28 : మంగినపూడి బీచ్‌ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, అబ్కారీ శాఖమంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం ఉదయం కలెక్టర్ బాలాజీ నేతృత్వంలో అధికారులు, ఉద్యోగులకు బీచ్‌లో ప్రత్యేక యోగ శిక్షణా కార్యక్రమం ఆదివారం సముద్ర తీరాన ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. మంత్రి రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ, డీఆర్వో చంద్రశేఖర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా బీచ్..

మంగినపూడి బీచ్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని మంత్రి అన్నారు. బీచ్ అభివృద్ధికి కమిటీ ఏర్పాటు చేసి టెంపుల్ టూరిజం ద్వారా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి ఆదివారం యోగా తరగతులు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. మచిలీపట్నం నుంచి విశాఖపట్నం వెళ్లేందుకు సీ ప్లేన్ ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. రవీంద్రతో పాటు కలెక్టర్, జేసీ, అధికారులు సముద్రతీరం వెంబడి స్వచ్ఛీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. సెప్టెంబరు 2న మచిలీపట్నంలో 30వేల మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్టు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖర్, డీపీవో నాగేశ్వరనాయ్, టూరిజం అధికారి రామలక్ష్మణ్, సమాచార శాఖ డీడీ వెంకటేశ్వర ప్రసాద్, సర్వే రికార్డుల ఏడీ మనీషా త్రిపాఠి, ఎలక్ట్రికల్ ఈఈ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై లైంగిక దాడి

- కేసు నమోదు

ఇబ్రహీంపట్నం, జూలై 28 : వితంతువుపై లైంగికదాడికి పాల్పడిన ఓ ప్రబుద్ధుడిపై పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడ రూరల్ మండలం రాయనపాడు అశోక్‌నగర్‌కు చెందిన మహిళ స్థానికంగా ఇళ్లలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. ఆమె భర్త ఏడేళ్ల క్రితం మరణించాడు. శనివారం రాత్రి పెద్దమ్మ వద్ద డబ్బులు తీసుకునేందుకు వెళుతుండగా కల్పతరువు రోడ్డులో పాగోలు నాగరాజు బలవంతంగా నిర్మానుష్యప్రాంతానికి లాక్కెళ్లి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పిన మినీ వ్యాన్

- 20 మందికి గాయాలు

ఇబ్రహీంపట్నం, జూలై 28 : విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం గుంటుపల్లి వద్ద మినీ వ్యాన్ అదుపు తప్పిన ఘటనలో 20 మందికి గాయాలయ్యాయి. కృష్ణాజిల్లా పెడన మండలం కవిపురం గ్రామానికి చెందిన కుటుంబం మినీ వ్యాన్‌లో పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయానికి ఆదివారం వెళుతుండగా గుంటుపల్లి వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. వేగ నియంత్రణలో మినీవ్యాన్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కట్లేరు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్

గంపలగూడెం : ఇసుక అక్రమ రవాణా చేస్తున్న తొమ్మిది ట్రాక్టర్లను పోలీసులు ఆదివారం సీజ్‌చేశారు. కనుమూరు రెవెన్యూ పరిధిలోని కట్లేరు నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి ట్రాక్టర్లను గంపలగూడెం స్టేషన్‌ను తరలించారు. వాహన యజమానులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రీను తెలిపారు.

నరసింహారావు మృతి తీరనిలోటు



పటమట, జూలై 28 : కృష్ణాజిల్లా సహకార బ్యాంకు మాజీ డైరెక్టర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్‌గా ఉద్యోగుల సమస్యల పట్ల అలుపెరగని పోరాటం చేసిన కరి నరసింహారావు మృతి బాధాకరమని నాన్‌టీచింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఆదివారం సంతాపాన్ని వ్యక్తం చేశారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నాన్‌టీచింగ్ ఉద్యోగుల సంఘం నుంచి అక్కిరాజు మంచిరాజు నరసింహారావు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఐటీఐలో రెండోదశ కౌన్సెలింగ్

భారతీనగర్ : ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024-25 విద్యాసంవత్సరానికిగాను రెండో విడత కౌన్సెలింగ్ ఆదివారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జరిగింది. కౌన్సిలింగ్‌కు 273 మంది హాజరుకావాల్సి ఉండగా 180 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో 134 మందికి వివిధ ట్రేడుల్లో అడ్మిషన్లు కేటాయించారు. ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మొత్తం 716సీట్లు ఖాళీ ఉండగా ఇప్పటి వరకు రెండు కౌన్సెలింగ్‌లో 643 సీట్లు (90 శాతం) భర్తీ అయ్యాయని, ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ ఎం.కనకారావు తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కృష్ణలంక, జూలై 28 : కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జూలై 29వ తేదీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజలకు అందుబాటులో వుండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. జిల్లా కేంద్రంతో పాటు, డివిజన్, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	104, 113, 124
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.80

తిరుపతమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం



గన్నవరం, జూలై 28: పాత గన్నవరంలోని తిరుపతమ్మ ఆలయంలో ఆషాఢమాసం నాలుగవ ఆదివారం పురస్కరించుకుని అంకమ్మ తల్లికి ఒడిగింటి బియ్యం సమర్పించారు. ఆలయ ప్రాంగణంలోని మానుకు పూజలు చేసి పొంగళ్లు సమర్పించారు. ఆలయ అభివృద్ధికి జాస్తి వెంకటేశ్వరరావు (పానకాలు) జ్ఞాపకార్థం ఆయన మునిమనవరాళ్లు కీర్తిశ్రీ చౌదరి, గ్రేష్మశ్రీ చౌదరిలు తిరుపతమ్మ తల్లి సేవా సదన్ నిర్మాణానికి రూ.50 వేలు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు అందజేశారు.

14మంది పేకాటరాయుళ్ల అరెస్టు

పెనమలూరు, జూలై 28 : పెనమలూరు పోలీసుస్టేషను పరిధిలోని కానూరులో ఒక పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 14మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద నుంచి రూ. 18,600లు నగదును స్వాధీనం చేసుకొన్నారు. కానూరులోని నవతా ట్రాన్సుపోర్టు సమీపంలో పేకాడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బంది దాడి నిర్వహించినట్లు సీఐ రామారావు తెలిపారు. పేకాట శిబిరాల నిర్వాహకులపై రౌడీ షీట్లు తెరుస్తామని హెచ్చరించారు.

ఎ.సీతారాంపురంలో క్షుద్రపూజల కలకలం

● భయాందోళనలో గ్రామస్థులు



రోడ్డుపై పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, బొగ్గు, ఉప్పులాంటి వస్తువులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 28 : ఎ.సీతారాంపురంలో ప్రజలు నడిచే రోడ్డుపై పసుపు, కుంకుమ, నిమ్మకాయలతో బొగ్గుచల్లి ఉండటం భయాందోళనలకు గురిచేసింది. ఎ.సీతారాంపురంలోని స్టేట్ బ్యాంకు ఎదురుగా గల వీధిలో ఆదివారం తెల్లవారు ఝామున గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేసినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో కుంకుమ, పసుపు, నిమ్మ కాయలు కోసి ఉండటంతో గ్రామస్థులు భయపడుతున్నారు.

సిమెంట్ బల్లల వితరణ



ఉయ్యూరు, జూలై 28 : వడ్డే బసవరాజ్యం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మండల పరిధి గ్రామాలకు 25 సిమెంట్ బల్లలు ట్రస్టు బాధ్యుడు వడ్డే సాయిశోభన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన నాయనమ్మ పేర ఏర్పాటు చేసిన వడ్డే బసరాజ్యం చారిటబుల్ ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. చిరువ్యాపారులు జీవనం సాగించేందుకు తోపుడు బండ్లు, దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, పేద విద్యార్థులకు స్కాలర్ షిప్పులు తోచిన విధంగా సాయం చేస్తున్నామన్నారు. గ్రామాల కూడళ్లలో తీరిక సమయంలో గ్రామస్థులు కలిసి కూర్చునేందుకు సిమెంట్ బల్లలు సమకూర్చామని వివరించారు.

రావి సేవలు అభినందనీయం



సురేష్‌బాబును సత్కరిస్తున్న గద్దె శేషగిరిరావు

కంకిపాడు, జూలై 28 : లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్ ఆధ్వర్యంలో తనకు ఉత్తమ సేవా పురస్కారం అవార్డు రావడం ఆనందంగా ఉందని లయన్, ఇంజనీర్ రావి సురేష్‌బాబు అన్నారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, విజయవాడలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దె శేషగిరిరావు చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షు లు సూర్యదేవర వేణు, మాజీ గవర్నర్ ఏ.ఆర్.కే చౌదరి, లింగం శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

ఈడుపుగల్లు సర్పంచ్ ఇందిర



వీధి దీపాలను ప్రారంభిస్తున్న సర్పంచ్ ఇందిర

ఈడుపుగల్లు (కంకిపాడు), జూలై 28 : మండలంలోని ఈడుపుగల్లు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిర అన్నారు. వినాయకుడి గుడి వద్ద నుంచి మసీదు వరకు ఉన్న ప్రధాన రహదారిపై కొత్తగా ఏర్పాటు చేసిన వీధి దీపాలను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కిలారు శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ షకార్, వార్డు సభ్యులు సుంకర శ్రీహరి, అనుమోలు రామకృష్ణ, కరీముల్లా, పంచాయతీ కార్యదర్శి అహ్మద్, బిల్‌కలెక్టర్ శ్రీను, ఫణిశ్రీ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్పుల పంపిణీ



స్కాలర్‌షిప్పులు పంపిణీ చేస్తున్న తుమ్మూరు పిచ్చిరెడ్డి మెమోరియల్ ట్రస్టు సభ్యులు

బోళ్లపాడు(ఉయ్యూరు), జూలై 28 : తుమ్మూరు పిచ్చిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో బోళ్లపాడులో 29 మంది మెరిట్, పేద విద్యార్థులకు రూ. 1.15 లక్షల స్కాలర్ షిప్పులు ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తుమ్మూరు గంగారత్నం ముఖ్యఅతిథిగా పాల్గొని స్కాలర్‌షిప్పులు పంపిణీ చేశారు. ట్రస్టు ఛైర్మన్ తుమ్మూరు నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ, తుమ్మూరు వంశీకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ప్రతి ఏడాది లక్ష రూపాయల వరకు స్కాలర్ షిప్పులు పంపిణీ చేస్తున్నామన్నారు.

ప్రజాభిమానం మరువలేనిది

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



యార్లగడ్డ వెంకట్రావు, బోడె ప్రసాద్‌ను శాలువాతో సత్కరిస్తున్న మస్తాన్‌రావు, నాగరాజు

ఉయ్యూరు, జూలై 28 : ఎంత ధనం సంపాదించినా, ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాల ముందు దిగదుడుపేనని, ప్రజాభిమానం ఎన్నటికి మరువలేనిదని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. తొలిసారి ఉయ్యూరు వచ్చిన వెంకట్రావుకు ఉయ్యూరు, మండల పరిధి గ్రామాల్లో ఆదివారం ఘనస్వాగతం లభించింది. సార్వత్రిక ఎన్నికల్లో గన్నవరం ఎమ్మెల్యే కూటమి అభ్యర్థిగా ఘనవిజయం సాధించి, అసెంబ్లీలో అడుగిడిన తరువాత ఆయన స్వగ్రామం పమిడిముక్కల మండలం పెనుముత్సకు మొట్టమొదటిసారిగా వెళ్తున్న సందర్భంగా ఉయ్యూరు, గండిగుంట, చినఓగిరాల వద్ద ఆయనతో ఉన్న పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు ఆదివారం అపూర్వస్వాగతం పలికారు. ఉయ్యూరు వెంకటేశ్వర టాకీస్ వద్ద మేడి మస్తాన్‌రావు, చినఓగిరాల సెంటర్‌లో మండల పార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, తోట్లవల్లూరు మండల టీడీపీ నాయకుడు వీరపనేని శివరామ్, గండిగుంట సెంటర్‌లో వల్లభనేని నాగభూషణరావు, దండమూడి రాంబాబు, టీడీపీ శ్రేణులు పూల దండలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకటేశ్వరటాకీస్ వద్ద కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు.

ఈ సందర్భంగా వెంకట్రావు ఉయ్యూరుతో తనకున సంబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తన విద్యాభ్యాసం వీఆర్‌కేఎం స్కూల్, ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలలో జరిగిందని ఆనాటి జ్ఞాపకాలు తెలిపారు. తన స్వగ్రామం వెళ్తున్న సందర్భంగా తనకు అపూర్వ స్వాగతం పలికినవారందరికి కృతజ్ఞతలు తెలిపారు. నేరెళ్ల వేణు, తేజ ఆధ్వర్యంలో యార్లగడ్డకు గండి గుంట బైపాస్‌వద్ద ఘన స్వాగతం పలికారు.




మోటార్లు ఆన్ చేస్తున్న టీడీపీ నాయకులు

రైతులకిచ్చిన హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

గన్నవరం : ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామిని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నిలబెట్టుకుని రైతుల పక్షాన నిలిచారని టీడీపీ సీనియర్ నాయకులు, ముస్తాబాద అధ్యక్షులు పాలడుగు మల్లికార్జునరావు అన్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ పంపిన మోటార్లను సూరంపల్లి వద్ద పోలవరం కాలువలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సకాలంలో పట్టిసీమ గోదావరి జలాలను విడుదల చేసి వ్యవసాయ మోటార్లు కూడా అందజేయటం గొప్ప విషయమన్నారు. ప్రతి ఎకరానికి సాగునీరు అందించటమే లక్ష్యంగా ఎమ్మెల్యే చర్యలు చేపట్టారని తెలిపారు. ఆరుగాలం శ్రమించి కష్టపడే రైతులకు భరోసా కల్పిస్తూ రూ.కోటి సొంత నిధులతో మోటార్లను ఎమ్మెల్యే యార్లగడ్డ అందించారని తెలిపారు. ముస్తాబాద పేడ చెరువుకు పోలవరం నీటిని తరలిస్తున్నామన్నారు. సుమారు 500 ఎకరాలకు ఈ సాగునీరు ఉపయోగపడుతుందని, భవిష్యత్‌లో ఎప్పుడు నీటి కొరత ఏర్పడినా ఈ మోటార్లను వినియోగించి పొలాలకు కావాల్సిన సాగునీటిని తరలిస్తామని తెలిపారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బోడపాటి రవికుమార్, ఉపాధ్యక్షులు కంచర్ల ఈశ్వరరావు, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు మేడేపల్లి రమ పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యం

జనసేన గన్నవరం సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్



కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న చలమలశెట్టి రమేష్, రవివర్మ

గన్నవరం, జూలై 28 : కార్యకర్తల సంక్షేమానికి జనసేన అధినేత అధిక ప్రాధాన్యతనిస్తున్నారని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని ముస్తాబాద గ్రామానికి చెందిన జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులు పల్లి తిరుపతిరావు రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆదివారం ఆ కుటుంబానికి రూ.10వేలు చెక్కును అందజేశారు. జనసేన పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి చిమట రవివర్మ, పసుమర్తి చంద్రశేఖర్, పల్లె కార్తీక్, గుండ్ర జానకిరాము, మహేంద్ర, దినేష్, గంగాధర్, సాయి, అయ్యప్ప బాగ్యలక్ష్మి, వినయ్, రామకృష్ణ, చంద్రశేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ముప్పా రాజా

స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ చిమట రవివర్మ, నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు పాల్గొని మాట్లాడారు. పార్టీ సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికీ రూ.5లక్షలు ఇన్సూరెన్స్ ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తు గాయాలైతే రూ.2.50లక్షలు బీమా వర్తిస్తుందన్నారు.

జనసేన క్రియాశీలక సభ్యత్వానికి విశేష స్పందన

కంకిపాడు : జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారని టీడీపీ, జనసేన సమన్వయకర్త ముప్పా రాజా అన్నారు. మండలంలోని కుందేరు, ఈడుపుగల్లు, కంకిపాడు గ్రామాల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. కాటూరులో ఒకే రోజులో 50 సభ్యత్వాలను గుర్రాల మధు చేపట్టడంతో ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజలందరూ సంతోషంగా జీవించాలని..



రంగయ్యప్పారావుపేటలో ఆషాఢ సారెకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 28 : ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుతూ గంగానమ్మ తల్లిని తమ ఇంటి ఆడపడుచుగా భావించి ఆషాడం సారె సమర్పించడం సంప్రదాయమని సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ యడవల్లి పాండు రంగారావు, మండల మహిళ సహ కన్వీనర్ కనకరత్నం తెలిపారు. రంగయ్యప్పారావుపేట, కానుమోలు, వేలేరు, బండారుగూడెం గ్రామాల్లో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గంగానమ్మతల్లికి ఘనంగా ఆషాడం సారె సమర్పించారు. మండల కన్వీనర్ తట్టి సుబ్బారావు, సహ కన్వీనర్ దావులూరి శ్రీహరి, కమిటీ సభ్యుడు బొత్స వెంకటే శ్వరరావు, పాల్గొన్నారు.

గంగాభికకు శాకంబరీ అలంకరణ

పెరికీడులోని గంగాభిక అమ్మవారు ఆదివారం శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో ఆలయ సేవకులు జెట్టి సీతమ్మతో కలిసి మహిళలు గంగాభిక అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు శ్యామ్ ఆధ్వ ర్యంలో పుట్టి కోటేశ్వరరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నండూరి సత్యవేంకటేశ్వరశర్మ, నక్కా బాబు, కొల్లిమర్ల రంగారావు, పుట్టి వీర్రాజు పాల్గొన్నారు.

శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి

ఉయ్యూరు : వాసవీక్లబ్ ఉయ్యూరు సర్కిల్ ఆధ్వర్యంలో శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆదివారం ఆషాడం సారె వైభవంగా నిర్వహించారు. శివాలయం రోడ్డు నుంచి ఆషాడ సారెతో మహిళలు ఊరేగింపుగా బయలుదేరి ప్రధాన సెంటర్ రావిచెట్టు బజార్ నుంచి సోమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీవాసవీ మాత అమ్మవారి ఆలయానికి చేరుకుని సారె సమ ర్పించి పూజలు చేశారు. 9వ వార్డు కౌన్సిలర్ పూర శ్రీవాణి, వాసవీ క్లబ్ అధ్యక్షుడు పూర కిషోర్‌కుమార్, కార్యదర్శి కొల్లిపర వెంకటహేమంత్, ఆత్కూరి వెంకటేశ్వరరావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ, బాల, బాబ్జి, నాగభూషణం, సంధ్యా రాణి, లక్ష్మీరూపవతి, యెండూరి వాసవి, సూర్యకుమారి, శ్రీలత, వై. సరస్వతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్న సమారాధన చేశారు.



ఉయ్యూరులో పూజలు..

చిన్నారుల్లో ప్రతిభను వెలికితీయడమే లక్ష్యం

ఎస్ఐపీ అకాడమి ఇండియా రీజనల్ డైరెక్టర్ సీబీ శేఖర్



శేఖర్‌ను సత్కరిస్తున్న ఎం.కిషన్‌బాబు

కంకిపాడు, జూలై 28 : నేటి చిన్నారులే రేపటి దేశ భవిష్యత్తుకు దిశా నిర్దేశకులని ఎస్ఐపీ అకాడమి ఇండియా రీజనల్ డైరెక్టర్ సీబీ శేఖర్ అన్నారు. స్థానిక అయాన్ కన్వెన్షన్ సెంటర్‌లో రాష్ట్రస్థాయి అబాకస్, మెంటల్ అర్థమెటిక్ కాంపిటీషన్ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీబీ శేఖర్ మాట్లాడుతూ, పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఎస్ఐపీ అకాడమీ విశేషంగా కృషి చేస్తుందన్నారు. చిన్నారుల్లో కొత్త విషయాలను తెలుసుకో వాలన్న ఉత్సుకత అధికంగా ఉంటుందన్నారు. దాన్ని గుర్తించి సరైన రీతిలో శిక్షణ ఇస్తే అసాధారణ ప్రతిభావంతులుగా మారుతారని తెలియజేశారు. దేశ వ్యాప్తంగా 23 రాష్ట్రాల్లో ఈ తరహా శిక్షణ పొందుతున్న 10 లక్షల మంది పిల్లలే ఇందుకు నిదర్శమని తెలియజేశారు. మూడు, నాలుగేళ్ల పాటు సాగే ఈ శిక్షణలో 11 లెవల్స్‌గా శిక్షణ ఉంటుంద న్నారు. ఈ పోటీ పరీక్షల్లో సుమారు 1000 మందికిపైగా చిన్నారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకోవడం జరిగిందని స్టేట్ హెడ్ గోపాలకృష్ణ తెలిపారు. ఈ పోటీ పరీక్షల్లో సుమారు 1000 మందికి పైగా చిన్నారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకోవడం జరిగిందని స్టేట్ హెడ్ గోపాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ప్రవీణ్, కృష్ణ, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

హెపటైటిస్ వ్యాధిపై అవగాహన ర్యాలీ

ఆనందపురం(గండిగుంట), జూలై 28 : ప్రపంచ హెపటైటిస్ డే పురస్కరించుకుని చిన ఓగిరాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఆనందపురంలో హెపటైటిస్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ తేజస్విని, సూపర్‌వైజర్ కంతేటి శ్రీనివాసరావు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



ఆనందపురంలో హెపటైటిస్‌పై అవగాహన ప్రదర్శన

ముగ్గురు యువకులకు తీవ్రగాయాలు

ఉంగుటూరు, జూలై 28 : జాతీయ రహదారి పక్కన సర్వీస్‌రోడ్డులో పెదఅవుటపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. గన్నవరం మండలం దావాజీగూడెం గ్రామానికి చెందిన గుర్రం తేజావెంకట్ అలియాస్ పండు (19), బొజ్జగాని నాగవంశీ (20), అల్లాపురం గ్రామానికి చెందిన జగన్నాథం శేషు (19) స్నేహితులు. ఆదివారం సెలవు కావటంతో మధ్యాహ్న సమయంలో ముగ్గురూ ఒకే బైక్‌పై ఆత్కూరులోని ఏలూరు కాలువ పక్కనున్న పంటకాలువలో ఈతకొట్టేందుకు వెళ్లారు. సాయంత్రం ఇంటికి వస్తుండగా పెదఅవుటపల్లి పీహెచ్‌సీ సమీపంలో ముందు వెళ్తున్న లారీని తప్పించే క్రమంలో ఎదురుగా రాంగ్‌రూట్‌లో వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో చినఅవుటపల్లిలోని పిన్నమనేని ఆసుపత్రికి తరలించారు. ఎస్సై పైడిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	104, 113, 124
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.80

ధర్మప్రచారంపై ప్రత్యేక దృష్టి



మచిలీపట్నం టౌన్ : ధర్మప్రచారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. తరకటూరు గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు తిరుమల తిరుపతి దేవస్థానం పక్షాన తితిదే ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు తురగా ప్రసాద్, జొన్నలగడ్డ మాధవి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు.



బందరులో గంగానమ్మకు సారె తెస్తున్న మహిళలు



కాపుల వీధి నుంచి పెడన పైడమ్మకు సారె తెస్తున్న మహిళలు



పెదప్రోలులో అద్దంకి నాంచారమ్మకు సారె..

అమ్మవార్లకు ఆషాఢ సారె

మచిలీపట్నం టౌన్, జూలై 28 : మచిలీపట్నం రేవతీ సెంటర్‌లోని గంగానమ్మ తల్లికి ఆదివారం సువాసినులు ఊరేగింపుగా వచ్చి ఆషాఢ సారె సమర్పించారు. మేళతాళాలతో లలితా సహస్ర నామ పారాయణ చేస్తూ మహిళలు పాల్గొన్నారు. చిట్టికుమారి, అంజిబాబు తదితరులు పర్యవేక్షించారు. ఆషాఢ మాసం సందర్భంగా రాజుపేటలోని లక్ష్మీనాంచారమ్మ అమ్మవారిని ఆదివారం శాకంబరీగా అలంకరించారు. సువాసినులు ఊరేగింపు జరిపారు. **పెడన** : ఆషాడమాసం సందర్భంగా గ్రామ దేవత పైడమ్మ అమ్మవారికి కాపు సామాజిక వర్గానికి చెందిన మహిళలు ఆదివారం సారె సమర్పించారు. కాపులవీధి నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా బయలుదేరి ముత్యాలమ్మ గుడి, పోతురాజు స్వామి గుడి మీదుగా కొత్తపేటలోని పైడమ్మ దేవస్థానానికి చేరుకుని అమ్మ వారికి భక్తిశ్రద్ధలతో ఆషాఢ సారె సమర్పించారు. సారె సమర్పణలో దేవస్థానం ఈవో తిక్కిశెట్టి వీరవెంకట మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు, తోట హరిబాబు, కూనపరెడ్డి వెంకటేశ్వరరావు, మాదాసు బాబూరావు, వరుదు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. శిష్టకర్ణ సామాజిక వర్గానికి చెందిన మహిళలు కూడా పైడమ్మ అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. **అవనిగడ్డ రూరల్** : వేకనూరులో సూర్యనారాయణ స్వామి శాంతి కళ్యాణాన్ని రెడ్రౌతు మోహనరావు దంపతులు జరిపించారు. విశ్వేశ్వరస్వామి సహిత కాశీ అన్నపూర్ణ దేవి, ఉషా, పద్మిని అమ్మవార్లకు సమీర్ సేవా ఫౌండేషన్ ఆధ్వరంలో ఆషాఢ సారె సమర్పించారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు తుంగల వీరవ సంతరావు - ఇందిరా దంపతులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు. **మోపిదేవి** : పెదప్రోలు అద్దంకి నాంచారమ్మకు ఆదివారం శాకంబరీ అలంకారం చేసి, గ్రామ ప్రజలు సారె సమర్పించారు. గంగానమ్మ అమ్మవారి ఆలయం నుంచి సారె చేత పట్టుకుని పాదయాత్రగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా గురుప్రసాద్, కెవిఎన్.కె..కోటేశ్వరరావుల ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు. **పెడన రూరల్** : చెన్నూరులో వేంచేసి ఉన్న మహంకాళమ్మ, గంగానమ్మ, అంకమ్మ, అంకాలమ్మలకు మహిళలు ఆషాఢసారె అందించారు. గ్రామస్థులు మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి దేవతలకు సారె సమర్పించుకున్నారు.



వేకనూరులో సమీర్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో



చెన్నూరులో..   మోపర్రులో బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

మోపర్రు గంగానమ్మకు బోనాలు

పెదపారుపూడి : మోపర్రులో కొలువై ఉన్న గంగానమ్మ తల్లికి గ్రామస్థులు, మహిళలు పెద్ద ఎత్తున ఆదివారం బోనాలు సమర్పించారు. బోనాలు తలపై పెట్టుకుని గ్రామపురవీధుల్లో ఊరేగించుకుంటూ వన్నేరు డ్రెయిన్‌లో కొలువైన అమ్మవారి వద్దకు ఊరేగింపుగా చేరుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాజలో ఇళ్ల మధ్య జోరుగా పేకాట!

● నియంత్రించాలని మహిళల వేడుకోలు

కూచిపూడి : మొవ్వ మండలం కాజలో పేకాట జోరుగా సాగుతోంది. వర్షాలు కురుస్తుండటంతో జడ్పీ హైస్కూల్ సమీపంలోని ఇళ్ల వద్దకు శిబిరాన్ని మార్చినట్లు సమాచారం. కూచిపూడి ఎస్సై శ్రీనివాసరావు సెలవులో ఉండడంతో పోలీసు అధికారులు, సిబ్బంది అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గూడూరు, ఘంటసాల, మొవ్వ మండలాలకు చెందిన పేకాటరాయుళ్లు పేకాట శిబిరానికి వస్తుండడంతో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. పోలీసు అధికారులు తక్షణమే స్పందించి పేకాటరాయుళ్ల ఆటకట్టించాల్సిందిగా గ్రామస్థులు కోరుతున్నారు.

ఇబ్బడి ముబ్బడిగా మద్యం బెల్టు షాపులు

ఇబ్బడిముబ్బడిగా ఉన్న బెల్టుషాపులతో ఇబ్బందులు పడుతున్నామని, నియంత్రించాలని ఆయా గ్రామాల ప్రజ లు అధికారులను వేడుకుంటున్నారు. గుడి, బడి, నివాస ప్రాంతాలన్న తేడాలు లేకుండా బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా విస్తరించాయని ప్రజలు వాపోతున్నారు. మొవ్వ, కూచిపూడి, పెదపూడి, చినముత్తేవి, కాజ, కోసూరు, భట్లపెనుమర్రు, పెడసనగల్లు గ్రామాల్లో బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అధికారుల కనుసన్నల్లోనూ బెల్టుషాపులు నడుస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. బడ్డీకొట్ల ముసుగులో మద్యం షాపులు వెలిశాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల సమీపంలో కూడా షాపులు కొనసాగిస్తున్నారు. మద్యం దుకాణాలకు సమాంతరంగా బెల్టుషాపులు నడపటంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. బెల్టుషాపుల వద్ద శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోందని ప్రజలు వాపోతున్నారు. తక్షణం నియంత్రించాలని కోరుతున్నారు.

కాల్వల్లో దట్టంగా కిక్కిస

● నీటి ప్రవాహానికి అడ్డు ● తొలగించాలని వినతి



నందివాడ : రాళ్లకోడు, తండు (నెహరిల్లి కాలువ) కాల్వల్లో కిక్కిస పేరుకుపోవటంతో నీరు కిందకు వెళ్లకపోవటంతో సుమారు నాలుగు వేల ఎకరాల్లో ఆక్వా పంటకు నష్టం జరుగుతోందని మండల టీడీపీ అధ్యక్షులు దానేటి సన్యాసిరావు తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా కిక్కిస తొలగించాలని అధికారులను కోరినా పట్టించుకోలేదన్నారు. గత సంవత్సరం మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, వెనిగండ్ల రాము ఫోన్ ద్వారా డీఈ దృష్టికి ఈ విషయం తీసుకెళ్లినా చూద్దాం చేద్దాం అంటూ కాలయాపన చేశారన్నారు. కాల్వల్లో తూడు తొలగింపు అంటూ కోట్లలో టెండర్లు పిలిచి తూతూ మంత్రంగా పనులు కొనసాగిస్తున్నారన్నారు. చేపల చెరువుల్లో నీళ్లు బయటకు తీసినప్పుడు కాల్వల ద్వారా కిందకు వెళ్లే మార్గం లేక చేపలు, రొయ్యలకు వైరస్ వచ్చి రైతులు నష్టపోతున్నారన్నారు. మాజీ ఎంపిటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కిక్కిస పేరుకుపోవటంతో పోలుకొండ నుంచి లక్ష్మీనరసింహాపురం వెళ్లే రోడ్డు పూర్తిగా నీళ్లలో మునిగి కనీసం నడిచి వెళ్లటానికి కూడా వీల్లేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చొరవ చూపి కాల్వలో కిక్కిస తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఐ లవ్ గుడివాడలో సైక్లింగ్ క్లబ్ సేవలు

గుడివాడ : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపు మేరకు ఐ లవ్ గుడివాడ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సైక్లింగ్ క్లబ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు పట్టణంలోని డివైడర్‌లలోని పిచ్చిమొక్కలు, అడ్డదిడ్డంగా పెరిగిన తొలగించారు. ట్రాఫిక్ పోలీసులు సహకారం అందించారు. సైక్లింగ్ క్లబ్, ఐఎంఏ సభ్యుడు డాక్టర్‌మాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ వీధులను శుభ్రపరచడానికి సిబ్బంది ఉన్నప్పటికీ మన ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. ఐ లవ్ గుడివాడ కార్యక్రమంలో భాగంగా భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. డాక్టర్ పొట్లూరి వంశీ, డాక్టర్ తారక వీరేంద్ర, డాక్టర్ సురేష్, డాక్టర్ సూరజ్, లయన్స్ క్లబ్ సభ్యులు, ఐఎంఏ సభ్యులు, గుడివాడ సైక్లింగ్ క్లబ్ సభ్యులు, ఎఎన్ఆర్ కళాశాల, ఎస్పీఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ట్రాఫిక్ పోలీసులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చొరవతో పంట కాల్వ అభివృద్ధి



చల్లపల్లి : ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశాల మేరకు రైతులకు సాగునీరు సక్రమంగా అందించేందుకు కృషిచేస్తున్నట్లు ఇరిగేషన్ డీఈఈ రావెళ్ల రవికిరణ్ తెలిపారు. వక్కలగడ్డలో ఐదో నెంబరు యార్లగడ్డ బ్రాంచ్ పంట కాల్వ పూడికతీత పనులు ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టారు. గత మూడేళ్లుగా పూడిక తీయకపోవటంతో 2500 ఎకరాల ఆయకట్టు కలిగిన ప్రధాన పంట కాల్వ పంటబోదెలా మారిపోయింది. ఆయకట్టు రైతులు ఇటీవల ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన సూచనలతో ఇరిగేషన్ డీఈఈ రవికిరణ్ పర్యవేక్షణలో పూడికతీత పనులు చేపట్టారు. పంట కాల్వ పూడికతీత పట్ల రైతులు హర్షం వ్యక్తంచేశారు. సాగునీటి సమస్య పరిష్కారం చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు, ఇరిగేషన్ శాఖ డీఈ రవికిరణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీకాకుళం ఏఈ తానేటి ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

పామర్రులో వాసవీ వనితా క్లబ్ సేవలు



పామర్రు : వాసవీ క్లబ్ వ్యవస్థాపకుడు కేసీ గుప్తా చేపట్టిన సేవా కార్యక్రమాల స్ఫూర్తితో పామర్రు వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో నిరంతరం సేవలందించాలని రీజినల్ ఛైర్‌పర్సన్ రేణుకా రాణి పిలుపునిచ్చారు. అధికార పర్యటనలో భాగంగా ఆమె ఆదివారం పామర్రు వాసవీ క్లబ్‌కు విచ్చేశారు. పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పేదలకు నిత్యవసర సరుకులు, నిరుపేద విద్యార్థికి రూ.ఐదు వేల నగదు సాయం అందజేశారు. పామర్రు వాసవీ వనితా క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఘంటసాల త్రివిక్రమ సాయిరామ్ చిన్నం సుధాకర్, కంచర్ల వీర జనార్ధన, ఘంటసాల సునీత, చిన్నం శ్రీలక్ష్మి, కంచర్ల ఉషారాణి, జిల్లా ఇన్‌చార్జి బొగ్గవరపు సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు సుబ్బారావు మృతి

● ఎమ్మెల్యే కుమార్ రాజా నివాళి



కోడూరు : టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ తండ్రి పిట్టలంక గ్రామ టీడీపీ నాయకుడు సుబ్బారావు మృతి చెందారు. సుబ్బారావు భౌతికదేహాన్ని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుబ్బారావు అంతిమ యాత్రలో పాల్గొన్నారు. నియోజకవర్గ జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత, ప్రముఖ పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ పాల్గొని నివాళులర్పించారు. టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దిరిశం వెంకట్రావు, నాయకులు తానంకి చంటి, చీరాల తుఫాన్, రత్నకుమార్, గరికిపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మాదిగల సమస్యలపై ఐక్య పోరు

గుడివాడ : మాదిగ జాతి సమస్యలపై ఐకమత్యంగా పోరాడతామని మాదిగ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఎన్‌జీవోస్ హోంలో మాదిగ జరిగిన సమావేశంలో మాదిగల సమస్యలపై చర్చించారు. కంచర్ల సుధాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము దృష్టికి సమస్యలను తీసుకువెళ్తామన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ భవనం నిర్మాణం, బస్టాండ్ సెంటర్‌లో కాంస్య విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తామని ప్రకటించారు. కవిరాజ కళామందిర భవనాన్ని మాదిగ భవన్‌కు కేటాయించాలని, కంప్యూటర్ కోర్సులు, డప్పు, చెప్పులు, కళాకారులకు, కళలకు ప్రోత్సహించేలా వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. గజేంద్ర, వేల్పుల నాగబాబు, కొదమల గంగాధర్, మామిళ్ళ ఏలీషా, మరియబాబు, పండు, బుల్లా త్యాగరాజు, కలపాల బాబురావు, కె.జె విక్టర్‌పాల్, అత్తాటి సాల్మన్, పసలాది శేఖర్, వేశపోగు సుందరయ్య, అద్దంకి రాజ్‌కుమార్, దొండపాటి మహేష్, కొడాలి బాగ్యారావు, వెంపటి సైమన్, కొడాలి వినోద్‌రావు, ఉప్పలపాటి ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసం.. రూ.27 లక్షలకు టోకరా

మచిలీపట్నం టౌన్, జూలై 28 : సీనియర్ సిటిజన్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు లింగం మోజెస్ సైబర్ మోసగాళ్ల వలలో చిక్కి రూ. 27 లక్షలు పోగొట్టుకున్నారు. చిలకలపూడి పోలీసులకు ఈ మేరకు ఆదివారం ఆయన ఫిర్యాదు చేశారు. సీఐ సతీష్‌కుమార్ వివరాలు వెల్లడించారు. మొదట అంతర్జాతీయ నేరస్థులతో సంబంధం ఉందంటూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి మోజెస్‌ను బెదిరించి బ్లాక్‌మెయిల్ చేయడంతో వారి ఖాతాకు రూ. 2 లక్షలు వేశారు. రెండో పర్యాయం కూడా వారు అలాగే ఫోన్‌లో చెదిరించడంతో ఆయన తన ఎస్‌బీఐ ఖాతాలో ఉన్న రూ. 25 లక్షలు సైబర్ నేరస్తుల ఖాతాకు వేశారు. ఈ విషయం స్నేహితులకు చెప్పడంతో సైబర్ నేరమని తేల్చడంతో ఆదివారం లింగం మోజెస్ చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేద బాలికలకు అండగా ఉండాలి

మచిలీపట్నం టౌన్ : మానవతా వాదులందరూ మానవతా హాస్టల్ విద్యార్థినులకు సాయం అందించాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ స్టేట్ కమిటీ కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యవర్గ సమావేశం పవిత్ర డిగ్రీ కళాశాలలో జరిగింది. కోటేశ్వరరావు మాట్లాడుతూ, మచిలీపట్నం శాఖ పేద బాలికల హాస్టల్ విద్యార్థులకు సాయం అందించడం ముదావహమన్నారు. మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు శ్రీరామ్ అధ్యక్షత వహించగా, జిల్లా కార్యదర్శి శీతాల ప్రసాద్, మచిలీపట్నం శాఖ కార్యదర్శి కానుకొలను ఫణికిరణ్, ఉపాధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్, సభ్యులు మద్దాల చింతయ్య, పోతురాజు, సాయికృష్ణప్రసాద్, బి.కె. మల్లిఖార్జునుడు, పి.వి.ఫణికుమార్ పాల్గొన్నారు.

లింగన్నకోడు పూడికతీత పనుల పరిశీలన

కోడూరు : గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటం వల్లే డ్రైనేజీలు పూడిపోయాయని మాజీ జడ్పీటీసీ సభ్యుడు బండే శ్రీనివాసరావు అన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ శాఖ చేపట్టిన లింగన్న కోడు మీడియం డ్రెయిన్ పూడికతీత పనులను ఆదివారం కూటమి శ్రేణులు పరిశీలించారు. ఉల్లి శేషగిరిరావు, బచ్చు వెంకటేష్, యలవర్తి వెంకటేశ్వరరావు, వేములపల్లి శ్రీకృష్ణ, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, గోగినేని సోమశేఖరరావు, ముద్దినేని చంద్రరావు, కాట్రగడ్డ రాము, దోనేపూడి రాజేంద్ర, వరప్రసాద్, యనమదల శ్రీకృష్ణ, మల్లిపెద్ది నాంచారయ్య పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు

పెడన : సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత శిక్షణ కేంద్రంలో కుట్టు, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్, శారీ పెయింటింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. ట్రైనర్లుగా వ్యవహరించిన రామిశెట్టి దుర్గానారాయణమ్మ, పిచ్చుక నాగమణిలకు గౌరవ వేతనం అందించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ శ్రీహరిదాస్, ఫౌండేషన్ ప్రతినిధులు ఉస్మాన్‌బాషా, రాధాకృష్ణమూర్తి, శంకర సాంబశివరావు పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్టు .. మద్యం స్వాధీనం

కోడూరు : ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శిరీష తెలిపారు. ఇస్మాయిల్ బేగ్ పేట చెరువు వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

లక్ష్మీపతి కుటుంబానికి వేదవ్యాస్ పరామర్శ

పెడన రూరల్ : కొంకేపూడి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు శలపాటి లక్ష్మీపతి మృతి భాధాకరమని మాజీ ఉప సభాపతి బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. కొంకేపూడిలోని ఆయన సోదరుడు, మండల టీడీపీ అధ్యక్షుడు శలపాటి వీరప్రసాద్, కుటుంబసభ్యులను కలిసి ప్రగాఢసానుభూతి తెలిపారు. లక్ష్మీపతి చిత్రపటానికి నివాళులర్పించారు. నందమూరు మాజీ సర్పంచి పరసా రాంబాబు మనువని పుట్టినరోజు వేడుకలలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మాజీ ఉపసభాపతి బూరగడ్డ వేదవ్యాస్, జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, గుడిశేవ రామారావు, అంబటి కాంతారావు, జనసేన సమన్వయ కర్త పంచకర్ల సురేష్ యర్రంశెట్టి చంద్రశేఖర్, పాల్గొని చిరంజీవిని ఆశీర్వదించారు.

ముమ్మరంగా జనసేన సభ్యత్వ నమోదు

పెదపారుపూడి : పెదపారుపూడి గ్రామ సెంటర్‌లో జనసేన క్రియాశీలక కార్యకర్తల సభ్యత్వ నమోదు కార్యక్రమం ముమ్మరంగా చేపట్టారు. ముఖ్యఅతిథులుగా పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాడిశెట్టి నరేష్, మండల జనసేన అధ్యక్షుడు పోలిశెట్టి సురేష్ పాల్గొని సభ్యత్వ నమోదును పర్యవేక్షించారు. మండల పార్టీ అధ్యక్షుడు వినోద్, జనసైనికులు పాల్గొన్నారు.



జనసైనికుడికి ఆర్థిక సాయం

పెడన రూరల్ : ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన నడుపూరుకు చెందిన జనసైనికుడు సిహెచ్ పూర్ణచంద్రరావుకు జనసేన పార్టీ నుంచి రూ.50 వేల చెక్కును నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పంచకర్ల సురేష్ ద్వారా అందించారు. శింగలూరి శాంతిప్రసాద్, బత్తిన హరిబాబు, ఊచా వెంకయ్య, నవీన్ కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరాలకు విశేష స్పందన



ఉదయపు నడక మిత్ర మండలి..



గుడ్లవల్లేరులో పిల్లలకు వైద్య పరీక్షలు



చల్లపల్లిలో...



నాగాయలంకలో..

మచిలీపట్నం టౌన్ : ఉదయపు నడక మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ టాప్‌స్టార్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 205 మందికి డాక్టర్ అర్చన, వాసన్ ఐ కేర్ వైద్యులు డాక్టర్ ప్రసూన తదితరులు పరీక్షలు జరిపారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా మందులు పంపిణీ చేశారు. అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్,కార్యదర్శి జల్దు మురళీనాధ్, వి. లక్ష్మీనరసింహం, లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు, అర్జా ప్రసాద్, జగన్ మోహనరావు, బండి విద్యారేఖ, మల్లికాంబ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ సేవాభవన్‌లో పిల్లలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గుడివాడ నవ్య సాయి పిల్లల హాస్పటల్ వైద్యుల సహకారంతో శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఉప్పలపాటి వేణుగోపాలరావు శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ ఎ.శ్రీనాథ్ రెడ్డి, డాక్టర్ శ్రీశ్రావ్య 70 మంది పిల్లకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శశికళ, పెరుమాళ్ళు, నవాబు, వై.పిసి ప్రసాద్, వెంకట సుబ్బారావు చౌదరి, పొట్లూరి శ్రీవెంకటేశ్వరరావు, జంగం మోహనరావు, సూరపనేని పరంధామయ్య, మూల్పూరి సుధాకర్, వెనిగళ్ళ నాగేశ్వరరావు, సిహెచ్ రాజేశ్వరరావు, పోలవరపు వెంకటరావు, గుత్తికొండ సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లి : చల్లపల్లి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర చికిత్సా శిబిరం నిర్వహించారు. కొల్లిపర శివపార్వతీ జ్ఞాపకార్థం ఆమె భర్త నాగ పోతరాజు (మధు), కుమారుడు కొల్లిపర చైతన్య - మౌనిక, కుటుంబసభ్యులు సహకారంతో శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ బొగ్గవరపు మోహనరావు 120 మందికి కంటి పరీక్షలు చేసి వారిలో 30 మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు. విజయవాడలోని అమరావతి కంటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఉచిత ఆపరేషన్లు చేయిస్తారు. క్లబ్ అధ్యక్షురాలు మాజేటి అమరవాణి, దింటకుర్తి జ్యోతి, జయలక్ష్మి, పృథ్వీశ్వరరావు, కుసు మ, రాములు, రత్నం, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నాగాయలంక : పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మారుతీ విద్యానికేతన్ స్కూల్‌లో ఆదివారం నేత్ర వైద్యశిబిరం జరిగింది. శిబిరాన్ని తహసీల్దార్ ఎం.హరనాథ్ బాబు ప్రారంభించారు. వైద్యులు కమల, రితిక 152 మందిని పరీక్షించి 124 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. తలశిల శ్రీరాములు, వెంకయ్య, అంకిసీడు ఆర్థిక సౌజన్యంతో వైద్యశిబిరం జరిగింది. తలశిల రఘుశేఖర్, కనిగంటి నారాయణ, లీలా మనోహర్, లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి, గంగాధర్, మల్లిఖార్జున, మస్తాన్, తలశిల రవి, మత్తి శివ సేవలందించారు.

